క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



జి.కొండూరు: మండల పరిధి పినపాక గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న సీసీ డ్రెయిన్లకు భూమిపూజ చేశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించేందుకు రూ.50 వేలను పాఠశాలకు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన గరికపాటి ఇందు అనే విద్యార్థినికి రూ.15 వేలను ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ



విస్సన్నపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు.

పెట్రోల్ బంక్ పరిశీలన

స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని పెట్రోల్ బంక్‌ను ఆర్డీఓ తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రేషన్ షాపును పరిశీలించారు. రీ సర్వేపై ఆరా తీశారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఇబ్రహీంపట్నం: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ ఇబ్రహీంపట్నం డిపోలో ఉద్యోగులు గురువారం తెల్లవారుజామున ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న నైట్ ఔట్ అలవెన్సులు విడుదల చేయాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ పి.శ్రీనివాసరావు, డిపో చైర్మన్ కె.నరసింహారావు, డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు, డిపో ప్రచార కార్యదర్శి ఎంసీహెచ్ మోహన్, డిపో వైస్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు, కోశాధికారి వి.ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జిల్లా నాయకులు వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళి



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో గురువారం శిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ నరసింహారావు మాట్లాడుతూ ధైర్యానికి, దేశభక్తికి, ధీరత్వానికి శివాజీ మారుపేరని అన్నారు. ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు



తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేసిన యరమాల ప్రతాపరెడ్డికి అభినందన కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు అధ్యాపకులు, స్నేహితులు, బంధువులు ప్రతాపరెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, రిటైర్డ్ పీడీ జె. రంగారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కట్టెలేరుపై వంతెన నిర్మాణం కలేనా?

- నీటిమూటగా మిగిలిన కూటమి వాగ్దానాలు
- 20 గ్రామాల ప్రజల ఇక్కట్లు
- వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా బంద్



వినగడప వద్ద కట్టెలేరుపై ధ్వంసమైన వంతెన (ఫైల్)

తిరువూరు: గంపలగూడెం నుంచి వినగడప వైపు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో కట్టెలేరుపై వంతెన వరదలకు ధ్వంసమైంది. ధ్వంసమైన లో లెవెల్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిపోయి గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంపలగూడెం మండలంలోని వినగడప, కొత్తపల్లి, అనుముల్లంక, నారికింపాడు తదితర గ్రామాలకు వెళ్లేందుకు కట్టెలేరుపై ధ్వంసమైన వంతెన స్థానంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించడానికి రహదారులు, భవనాల శాఖాధికారులు పంపిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసి రూ.26 కోట్లు కేటాయించినప్పటికీ సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలుతో తదుపరి ప్రక్రియ కొనసాగలేదు. వర్షాకాలంలో వినగడప వైపు వెళ్లడానికి వంతెన సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెరవేరని హామీలు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరువూరు నుంచి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన కేశినేని చిన్ని, కొలికపూడి శ్రీనివాసరావులు తాము గెలిచిన వెంటనే కట్టెలేరు వంతెన పునర్నిర్మాణాన్ని చేపడతామని ప్రచార సమయంలో వాగ్దానాలిచ్చారు. వంతెన నిర్మాణానికి నిధులు వచ్చాయని, జీఓ విడుదలైందని పలుమార్లు ఊదరగొట్టారని, తదుపరి కట్టెలేరు వంతెన పనుల గురించి పట్టించుకున్న నాథుడే లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శాసన మండలిలో పలుమార్లు ఈ వంతెన నిర్మాణం గురించి ప్రస్తావించారు. సీపీఎం ఆధ్వర్యంలో కూడా వంతెన నిర్మాణం కోరుతూ ఆందోళనలు నిర్వహించారు.

రూ.30 కోట్లతో అంచనా

వినగడప వద్ద కట్టెలేరుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి 16వ ఆర్థిక సంఘం నుంచి రూ.30 కోట్ల నిధులు కోరుతూ ప్రతిపాదించాం. 184 మీటర్ల పొడవు వంతెన నిర్మాణం జరపాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు ప్రారంభిస్తాం.

– రాజకుమారి, ఆర్ అండ్ బీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తిరువూరు

వంతెన నిర్మాణానికి పోరాడతాం



ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు ఉదాసీన వైఖరి అవలంబించడం శోచనీయం. కట్టెలేరు వంతెన నిర్మాణం చేపట్టేవరకు ఆందోళన కొనసాగిస్తాం. గంపలగూడెం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– గువ్వల సీతారామిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు

నిధులు మంజూరు చేయాలి



ఏడేళ్లుగా గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల ప్రజలు వినగడప మీదుగా రాకపోకలు సాగించేందుకు కట్టెలేరుపై వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పునర్నిర్మాణానికి ఎన్నిసార్లు ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వాధికారులు స్పందించలేదు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– మద్దిరెడ్డి వెంకటరెడ్డి, సీపీఎం గంపలగూడెం మండల కార్యదర్శి

ఆప్కాస్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నూజివీడు: ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేట్ ఏజెన్సీలకు కాంట్రాక్ట్ కార్మికులను అప్పగించాలని చేసే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఆప్కాస్ విధానం వలన ప్రభుత్వానికి వచ్చే నష్టమేముందని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం సమంజసం కాదన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానం ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు కచ్చితంగా వస్తున్నాయని, వేతనాల్లో ఏ విధమైన కోతలు ఉండటం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ వాటాలు సక్రమంగా కార్మికుల ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.జయలక్ష్మి, గౌరీ, భారతి, భవాని, చంద్రశేఖర్, ఏడుకొండలు, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కక్కుతున్న భానుడు



నిర్మానుష్యంగా మారిన ఆగిరిపల్లి ప్రధాన రహదారి

ఆగిరిపల్లి: భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచి తన ప్రతాపం చూపుతున్నాడు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకీ పెరుగుతున్న ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. వారం రోజుల నుంచి పగటి పూట 39 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు నెలల పాటు ఎండలు, వడగాల్పులతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలన్న భయాందోళనకు ప్రజలు గురవుతున్నారు. బయటికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఆగిరిపల్లిలో గురువారం ఉదయం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం చిరుజల్లులు పడటంతో ప్రజలు కొంత ఉపశమనం చెందారు.

భద్రాచలానికి తిరువూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు

తిరువూరు: సీతారాముల కల్యాణం, శ్రీరామ నవమి సందర్భంగా తిరువూరు నుంచి భద్రాచలానికి ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం నుంచి 10 ప్రత్యేక బస్సులు నడుపుతామని తిరువూరు డిపో మేనేజర్ ఎ. సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. పండుగ సందర్భంగా ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు చొప్పున తిరువూరు బస్టాండ్ నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. ఇవే కాకుండా విజయవాడ నుంచి తిరువూరు మీదుగా భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. సీతారాముల కల్యాణం అనంతరం 6వ తేదీన తిరుగు ప్రయాణంలో భద్రాచలంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి బస్సులు బయలుదేరి తిరువూరు మీదుగా విజయవాడ చేరుతాయని వివరించారు.

బైండోవర్ ఉల్లంఘనకు జరిమానా

మునునూరు: ఎక్సైజ్ నేరంలో బైండోవర్ ఉల్లంఘించి సారా అమ్ముతున్న వ్యక్తికి జరిమానా విధించారని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఏడాది వరకు ఎలాంటి నేరానికి పాల్పడబోనని బైండోవర్ అయిన మునునూరుకు చెందిన చెంగల నాగేంద్రరావు తిరిగి అదే నేరానికి పాల్పడ్డాడు. దీంతో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట ప్రవేశపెట్టగా రూ.10 వేలు జరిమానా విధించారు.

ఉపాధ్యాయుల బడిబాట



మల్లేల(తిరువూరు రూరల్): మండలంలోని మల్లేల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. బడిబాటలో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ కోసం ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులను కలిసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి జెడ్పీ పాఠశాలలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

సారా కేసుల్లో పాత నేరస్తుల బైండోవర్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాకు చెందిన వడిత్యా రాజమ్మ, కొండపర్వకు చెందిన మాలావతు రాణి, ఎ. కొండూరు మండలం గోపాలపురం తండాకు చెందిన సఫావత్ లాలిలను సారా పాత కేసుల్లో రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపారు. ఎ. కొండూరు తహసీల్దార్ వద్ద నలుగురుని బైండోవర్ చేశారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం, విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామాల్లో నవోదయ 2.0 లో భాగంగా సారా నిర్మూలనకు గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

హైదరాబాద్ బస్ సర్వీస్ మళ్లింపు

మునునూరు: నూజివీడు నుంచి హైదరాబాద్, జీడిమెట్ల బస్సు సర్వీసును ఇకపై లోపూడి మీదుగా నడుపుతున్నామని నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి ఎనిమిది గంటలకు నూజివీడులో బయల్దేరి చెక్కపల్లి, సూరేపల్లి మీదుగా వెళుతున్న సర్వీసును లోపూడి, యర్రావారిగూడెం, సోమవరం, మర్లపాలెం మీదుగా హైదరాబాద్, జీడిమెట్లకు చేరుతుందని, అక్కడ రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరి తిరిగి ఇదే రూట్‌లో నూజివీడు చేరుకుంటుందని వివరించారు. బస్సు సర్వీసు మళ్లింపుపై స్థానిక పెద్దలు, వ్యాపారులు, విద్యా వేత్తలు, నేతలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఆగిరిపల్లి: మండలంలో బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నాలుగో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఆనంద్‌బాబు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకంతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

అన్నదానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బీకాలనీ వద్ద నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో 250 మందికి అన్నదానం చేశారు. ఈనెల 11 నుంచి జరుగనున్న ఆలయం, సాయినాథుని పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి నవమి ఉత్సవాలు

చాట్రాయి: అపర భద్రాద్రిగా పేరుగాంచిన చనుబండ కోదండ రామాలయంలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 4న అగ్ని ప్రతిష్ఠ, 5న ఎదుర్కోలు ఉత్సవం (వధూవరుల అన్వేషణ), 6న సీతారాముల కల్యాణం, 7న మహా పట్టాభిషేకం, మహా అన్నదానం, రాత్రి 11 గంటలకు రథోత్సవం, 8న వసంతోత్సవం, 9 రాత్రి పవళింపు సేవతో నవమి వేడుకలు ముగుస్తాయి. కల్యాణ పీటలపై కూర్చునే దంపతులు దేవస్థానం సెల్: 99487 09543 నంబర్‌ను సంప్రదించాలని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నూజివీడు: ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నూజివీడు యూనిట్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు మహాలక్ష్మి, గంగాధరరావు కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షుడిగా వంగల గోవిందరావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఈమని శేషయ్య, ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎంకేవీఎల్ఎన్ సోమయాజులు, కోశాధికారిగా కేఎస్ఆర్‌కే ప్రసాదరావు, కార్యదర్శులుగా వి.రాంబాబు, బీఎల్వీ కోటేశ్వరి, కె.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా ఎ.శేషగిరిరావు, ఆర్.సత్యనారాయణ, కేవీ శివ, ఎస్‌కేఎం సుభాని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ఏ ఖాదర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎన్‌పీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

శారీరక మార్పులను అర్థం చేసుకోవాలి



గానుగపాడు(తిరువూరు రూరల్): వయస్సుతో పాటు హార్మోన్ల ప్రభావం వల్ల శరీరంలో మార్పులు రావడం సహజమని, ఈ మార్పులను అర్థం చేసుకుని విద్యను కొనసాగించాలని డాక్టర్ ఎ. సింధు అన్నారు. బేటీ పడావో–బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా గురువారం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే చదువు మానివేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీబీ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు రాంప్రదీప్, రామారావు, సుదర్శన్, సాంబశివరావు, రాము పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుల పరిశీలన

విస్సన్నపేట: బీసీ, ఈబీసీ వారికి ఆర్థిక సహాయం కోసం ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఆయా బ్యాంకుల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

మునునూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు జవాబు దారీగా పని చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అధికారులను ఆదేశించారు. మునునూరులో తహసీల్దార్ కార్యాలయం, కొర్లగుంటలో తాళ్లవల్లి రీసర్వే గ్రామ సభను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (మీ కోసం) వివరాలను, రికార్డులను తనిఖీ చేసి, ప్రస్తుత అర్జీల స్టేటస్‌ను చెక్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదన్నారు. అర్జీదారులకు వారి సమస్యల పరిష్కార వివరాల స్టేటస్‌ను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. తొలుత కొర్లగుంటలో రీ సర్వే గ్రామ సభను పరిశీలించారు. కార్యక్రమాల్లో కొర్లగుంట సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ, డీటీ పురుషోత్తమ శర్మ, మండల సర్వేయర్ సురేష్, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ రాజీనామా



రాజీనామా లేఖను కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తన పదవికి రాజీనామా చేశారు. నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం జరిగింది. ఇటీవల వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు చైర్‌పర్సన్ తన రాజీనామా లేఖను కమిషనర్ లోవరాజుకు అందజేశారు.

పట్టణ అభివృద్ధికి కృషి చేశా..

ఆమె మాట్లాడుతూ తన పదవీ కాలంలో పట్టణ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశానని తెలిపారు. రహదారుల అభివృద్ధికి, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పట్టణ సమస్యలపై 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు మాట్లాడుతూ వీధిలైట్లు వెలగక పలు వార్డుల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణా నదీ జలాలు తాగునీటి సరఫరా కోసం రూ. 240 కోట్లు ఏడీబీ నుంచి మంజూరయ్యాయని, ప్రభుత్వం రూ.30 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించగా, మరో 35 కోట్లు నగర పంచాయతీ చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులు నగర పంచాయతీ భరించే అవకాశం లేనందున ప్రభుత్వమే చెల్లించాలని కౌన్సిల్లో శ్రీనివాసరావు చేసిన ప్రతిపాదనను ఆమోదించి తీర్మానించారు.

8న ప్రత్యేక సమావేశం

చైర్‌పర్సన్ ఇచ్చిన రాజీనామాపై కౌన్సిల్‌లో చర్చించేందుకు ఈ నెల 8న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కమిషనర్ లోవరాజు వైస్ చైర్‌పర్సన్స్ వెలుగోటి విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిష్కళంక మాత మహోత్సవాలు ప్రారంభం



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న పాస్టర్లు

మునునూరు: నిష్కళంకమాత ఉత్సవాల్లో వేలాదిగా విశ్వాసులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఓఎంఐ నోవిస్ మాస్టర్ ఫాదర్ జోయ్ అమల్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మునునూరు ఆర్సీఎం విచారణ పరిధిలోని నెహ్రూనగర్ పుణ్య క్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జోసఫ్‌తంబి ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేసి నిష్కళంక మాత మహోత్సవాలను ప్రారంభించారు. ఫాదర్ జోయ్ అమల్ మాట్లాడుతూ వేలాది మంది విశ్వాసులు, భక్తుల కోరికలు తీరుస్తూ, దీక్షాపరుల క్రీస్తు శ్రమల 40 రోజుల ఉపవాస ప్రార్థనలకు ప్రతీకగా నిలుస్తున్న మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా స్థానిక సెయింట్ జోసఫ్ యూత్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని గ్రామాలను కలుపుతూ వలసపల్లి నుంచి నెహ్రూనగర్ వరకు 40 కిలో మీటర్ల భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో పాస్టర్లు, సిస్టర్లు, ఉపదేశులు భూషణం, ఆంతోని, బెనర్జీ, స్వామిదాసు, లాజరు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



సారా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నూజివీడు: మండలంలోని సిద్ధార్థ నగర్, ఓగిరాల తండా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఏఈఎస్ అజయ్ కుమార్‌సింగ్ పేర్కొన్నారు. నవోదయం-2.0లో రెండు గ్రామాల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా సారా తయారు చేయడం, విక్రయించడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న కృష్ణా, విజయనగరం జిల్లాల జట్లు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమి సందర్భంగా కొటికలపూడి గ్రామంలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. కొటికలపూడి అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎంపీపీ పాలడుగు జోత్స్న, కూటమి నేతలు ప్రారంభించారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగిన మొదటి మ్యాచ్‌లో కృష్ణా, విజయనగరం జిల్లా జట్లు తలపడ్డాయి. టోర్నమెంట్ ముగింపు అనంతరం విజేత జట్టుకు రూ.40 వేలు, ద్వితీయ స్థానం జట్టుకు రూ.30 వేలు, తృతీయ జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తామని టోర్నమెంట్ ఆర్గనైజర్లు బండి వెంకటరావు, చాట్రగడ్డ కోటయ్య తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: సీడీపీఓ కార్యాలయం పరిధిలోని అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులను నూజివీడు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని ఇన్‌చార్జి సీడీపీఓ కె.ధనలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణంలోని రజకపేట (బీసీ–డీ), కోనేరుపేట (ఓసీ), ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్కలం-2 (ఎస్సీ), ఆగిరిపల్లి-3 (బీసీ–ఈ), బొద్దనపల్లి-3 (బీసీ–డీ), వడ్లమాను-1 (బీసీ–డీ), చాట్రాయి మండలం బూరుగగూడెం (బీసీ–డీ), మునునూరు-2 (బీసీ–డీ) ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై అదే గ్రామానికి చెందిన కోడలై ఉండి 21 ఏళ్ల వయస్సు నిండి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రాన్ని జతపరచాలని చెప్పారు. ఇతర వివరాలకు నూజివీడులోని సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.